క్లుప్తంగా

ఆకట్టుకున్న నాటకం



సీతా స్వయంవరం వీధి నాటకంలో ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో శ్రీగౌరీశంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక కళాకారులు సీతా స్వయంవరం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమాహాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించాగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో రాముడుగా కోనిబోని బుజ్జి, సీతగా గారా శివ, లక్ష్మణుడుగా కిల్లాడి రాజేష్, రావణుడుగా మొరుకుర్తి శ్రీను, నారదుడుగా అట్ల త్రిమూర్తులు నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రేసింగ్ చేశారు. ముందుగా గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు.

25న మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 25వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోలి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ చేదులూరి మణి వీరకంఠ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కబడ్డీ ఆటపై నైపుణ్యం కలిగి ఉండి, 75 కేజీలలోపు బరువు ఉన్న మహిళలు తమ ఆధార్‌కార్డు వివరాలతో 9573349777, 9676664121 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఎంపికైన మహిళా జట్టు ఈ నెల 20 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కర్నూలు జిల్లా గోనేగండ్లలో నిర్వహించే 70వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ



చిన్నారులతో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్‌ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కోటనందూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎన్ వేణుగోపాల్ పరిశీలించారు. చిన్నారులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు ఎమ్ నాగగోవిందు, ఆర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సీఐ అశోక్

ప్రత్తిపాడు: స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్‌ఈబీ) పరిధిలోని ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో సెబ్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. సెబ్ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం.. పెద్దనాపల్లి గ్రామంలోని కాలువ గట్టు సమీపాన నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసి, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ఎస్ తిమ్మాపురం గ్రామానికి చెందిన సపిరెడ్డి సతీష్‌పై పరారీ కేసు నమోదు చేశారు. శంఖవరం మండలం కత్తిపూడి హరిజనవాడలో ఆరుగుల గంగారావును ఐదు లీటర్ల సారాతో అరెస్టు చేసి, శంఖవరం తహసీల్దార్ వద్ద హాజరుపరిచారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారని సెబ్ సీఐఅశోక్ తెలిపారు.

కార్తిక పౌర్ణమి సభకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ కృతికా శుక్లాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పేరూరి సూరిబాబు

కాకినాడ సిటీ: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ప్రాంగణంలో 27న కార్తిక పౌర్ణమి సభ నిర్వహించనున్నట్టు పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు వెల్లడించారు. బుధవారం ఆయన కలెక్టర్ కృతికా శుక్లాను కలసి ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం సూరిబాబు విలేకర్లతో మాట్లాడుతు సోమవారం ఉదయం 9 గంటలకు నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా అధ్యక్షతన సభ ప్రారంభం అవుతుందన్నారు.

రబీసాగుకు అడుగులు

- మెట్టలో కార్యాచరణ ప్రణాళిక
- ఆరుతడిగా 26,200 ఎకరాల్లో పంటలు



లోవ కొత్తూరులో రబీ అపరాలు సాగు చేయనున్న భూములు

తుని రూరల్: మెట్టలో ఆరుతడిగా రబీ సాగు చేసేందుకు వ్యవసాయ అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అవసరమైన విత్తనాలు, ఎరువులకు ప్రతిపాదనలను ఉన్నత అధికారులకు పంపించారు. వాతావరణం అనుకూలించకపోవడం, ఆశించినస్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్‌లో లక్ష్యానికి అనుగుణంగా సాగు జరగలేదు. దీంతో మెట్ట ప్రాంతంలో ఆరుతడిగా సాగయ్యే రబీపంటలను ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ అధికారులు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. రబీలో తొండంగి, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరులో స్వల్పంగా వరి సాగు, సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో అపరాలు, మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలు సాగయ్యే అవకాశాలను గుర్తించారు. పంపా, తాండవ, ఏలేరు ఆయకట్టు కింద 4,340 ఎకరాల్లో వరి, 15,161 ఎకరాల్లో మినుము, పెసర వంటి అపరాలు, మరో 6,699 ఎకరాల్లో ఇతరేతర పంటలు సాగవుతాయని అంచన వేశారు.

98 ఆర్‌బీకేల పరిధిలో

సబ్ డివిజన్‌లో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ఐదు మండలాల్లో 98 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో రబీసాగుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. 35 ఆర్‌బీకేల పరిధిలో వరి, 81 ఆర్‌బీకేల పరిధిలో పెసర, మినుములు ఇతర అపరాలు, 41 ఆర్‌బీకేల పరిధిలో మొక్కజొన్న, కూరగాయలు, తదితర పంటలను రైతులు సాగు చేయనున్నట్టు అంచనా వేశారు.

నీటి వసతులు

సబ్‌డివిజన్ పరిధిలో పంపా, తాండవ, ఏలేరు రిజర్వాయర్లు, విద్యుత్ బోరుబావుల నుంచి ఆయా పంటలకు సాగునీరు అందనుంది.

సబ్ డివిజన్ ఐదు మండలాల్లో ఆర్‌బీకేలు వారీగా సాగయ్యే పంటల వివరాలు

ఆర్‌బీకేల సంఖ్య	సాగయ్యే పంట	సాగు భూమి (ఎకరాల్లో)
35	వరి	4,340
81	అపరాలు	15,161
41	ఇతరేతర పంటలు	6,699
		26,200

ప్రతిపాదనలు సిద్ధం



ఖరీఫ్ సాగు చేయని రైతులసైతం రబీలో ఆరుతడి పంటలు సాగు చేసే అవకాశం ఉంది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వసతులతో ఎక్కువ ఆదాయం లభించే పంటలను రైతులు వేసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకోవాలి. రబీ పంటలకు అవసరమైన ప్రతిపాదనలను (యాక్షన్ ప్లాన్) ఉన్నత అధికారులకు పంపించాం.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తోందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ పద్మాజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ త్వరలో కులగణన కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలు చేపడుతుందని, వీటిని పరిశీలన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశ్వశక్తి భారత్ అనే కార్యక్రమం ద్వారా ఒక ఐఆర్ఎస్ అధికారి గ్రామీణ ప్రాంతాలకు వస్తారన్నారు. అలాగే 15 సంవత్సరాల లోపు విద్యార్థుల కోసం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు తోలేటి రాంప్రసాద్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు



తునిలో పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తుని: రోటరీక్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా తుని రాజా కళాశాల మైదానంలో బుధవారం ఖోఖో పోటీలు నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన 30 జట్లు పాల్గొన్నారు. 7, 9 తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారని రోటరీక్లబ్ తుని శాఖ కార్యదర్శి కిశోర్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులను అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఎంవీ ప్రసాదు హాజరయ్యారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు వర్మ, ప్రసాద్, నాగిరెడ్డి, మంగరాజు, కృష్ణబాబు, వీర్రాజు, సాయిబాబా పాల్గొన్నారు.

మురుగును తొలగించరూ..!



రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు

గండేపల్లి: అసలే శీతాకాలం.. చలికి జలుబు, ఒంటి నొప్పులు, జ్వరం తదితర సాధారణ వ్యాధులు వస్తునే ఉంటాయి. దీనికి తోడు పరిసరాల పరిశుభ్రత లేకుంటే మరిన్ని అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మండలంలోని నీలాద్రిరావుపేటలో డివైడర్‌కు ఎదురుగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువలో మురుగునీటితో దర్శనమిస్తోంది. నీరు పారే మార్గం లేకపోవడంతో వర్షపు నీరు, వాడుక నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. డ్రైనేజీని ఇటు పంచాయతీ అధికారులు, అటు హైవే మెయింటినెన్స్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగును తొలగించాలని కోరుతున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ మాట్లాడుతూ పలు మార్లు హైవే అధికారులకు తెలియపరిచినప్పటికీ స్పందించడంలేదన్నారు.

అభివృద్ధిని చూడండి.. ఆశీర్వదించండి..

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో నాయకులు
- గ్రామాల్లో సంక్షేమ పథకాలపై ప్రచారం



రాజుపేట సచివాలయంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు



ఏవీ నగరంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కృష్ణునిపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి



ఎస్.తిమ్మాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తోట రవి

జగ్గంపేట: ప్రచార ఆర్భాటాలు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని లబ్ధిదారులందరూ గమనించి రాబోయే ఎన్నికల్లో అందరూ ఆయన వెంటే ఉంటూ విజయానికి కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా అన్నారు. జగ్గంపేట సచివాలయం -1లో ఎంపీడీఓ వసంతకుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో అభివృద్ధి పనులు, సంక్షేమానికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాదవి, బండారు రాజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, ఎంపీటీసీ సభ్యులు, వార్డుమెంబర్లు, సచివాలయల సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపేటలో...

తుని రూరల్: తుని మండలం రాజుపేటలో సర్పంచ్ బుద్దాల సత్తిబాబు అధ్యక్షతన గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ పాల్గొని పార్టీ జండాను ఎగరవేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల ఫెక్సీని ఆవిష్కరించి, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు సుబ్రహ్మణ్వేశ్వరీ, నాయకులు యేసుబాబు, గోవిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుని 7, 8 వార్డుల్లో

తుని: ఎన్నికల సమయంలో గెలవడానికి పార్టీలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక గాలికి వదిలేసిన సంగతి మనందరం చూశామని, ఇందుకు భిన్నంగా వైఎస్సార్ సీపీ మాత్రం నూరు శాతం అమలు చేసి చూపించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నాలుగో సచివాలయం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథి సీపీ సుధారాణి సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, నాలుగున్నర ఏళ్ల జరిగిన సంక్షేమ, అభివృద్ధి, లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వ పరంగా జరిగిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, తుని పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, పిట్లకంచి కామేశ్వరరావు, కౌన్సిలర్లు విజయదుర్గ, నాగలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కృష్ణునిపాలెంలో..

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాలు లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, రౌతు జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, అంబటి ప్రసన్న, తోలేటి రాంప్రసాద్, కర్రి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కిర్లంపూడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ తోట రవి అన్నారు. ఎస్.తిమ్మాపురంలో సర్పంచ్ మందేటి వీరలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వై నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీతో, వనపర్తి వీరభద్రరావు, వైస్‌సర్పంచ్ నేలపాటి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, కో ఆప్షన్ సభ్యులు మీకా, నాయకులు పాల్గొన్నారు.

కేఈ చిన్నయ్యపాలెంలో

కోటనందూరు: కేఈ చిన్నయ్యపాలెంలో లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఎంపీపీ శ్రీనివాసు ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సంక్షేమ పథకాల జాబితా, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజాలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, సర్పంచులు గుడ్ల సత్తిబాబు, సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, పసగడుగుల వరహాలు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీ నగరంలో

తొండంగి: ఏవీ నగరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల జాబితా, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ బస్‌స్టేషన్‌ను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడు బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళీ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, రాష్ట్ర కాపుకార్పొరేషన్ డైరెక్టర్ దూలిపూడి అంజ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు బద్ది నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి సీతయమ్మ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



కత్తిపూడిలో బచ్చి సీతయమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: పేదలకు, బాటచారులకు వసతి కల్పించిన దాత బుచ్చి సీతయమ్మ సేవలు మరువలేనివని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. కత్తిపూడిలో ఉన్న బుచ్చి సీతయమ్మ 188 వర్ధంతిని ఈఓ వై.వెంకటేశ్వరరావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై బుచ్చి సీతయమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చడంతో మాతృత్వం కనబరచి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పని చేసి మరింత సేవలు అందజేయాలని సూచించారు. **ప్రస్తుతం కళాశాల విద్యార్థులకు భోజన సదుపాయాలు** కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంచి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఎంపీటీసీలు జీలకర్ర వీష్ణు, చల్లా సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు కృష్ణ, గౌతు నాగు, గౌతు **అర్జునబాబు, అడపా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.**

అదనపు తరగతి భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న తుని మాకినీడి బాబు తదితరులు

తొండంగి: ఎ.వి.నగరంలో జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో అదనపు తరగతి గదుల భవనాన్ని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు బుధవారం ప్రారంభించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిర్మించిన ఈ భవనాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో ఫార్మాఫౌండేషన్ గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఆస్పత్రులకు వైద్యపరికరాలు, తాగునీటి వాటర్ ట్యాంకు నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారన్నారు. అరబిందో ఫార్మాలిమిటెడ్ ప్రెసిడెంట్ జేవీఎస్ రెడ్డి మాట్లాడుతూ తీర ప్రాంతంలో కాకినాడ సెజ్ పరిధిలోని పెరుమాళ్లపురం, ఎ.వి.నగరం, కోదాడ తదితర గ్రామాల్లో కూడా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు కొయ్యా మురళి కృష్ణ, దడాల విజయ్, తోలడ శైలాపార్వతి, సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి, విద్యాశాఖాధికారులు, గ్రామపెద్దలు తదితరుల పాల్గొన్నారు.

విద్యకు తగ్గ ఉపాధి

- ప్రత్యేకమైన ఉద్యోగాల కోసం శిక్షణ
- ప్రతి నెలా రెండు జాబ్‌మేళాలు
- మోడల్ కేరీర్ కేంద్రంగా ఉపాధి కల్పన కార్యాలయాలు

అభ్యర్థుల నమోదు..

పదో తరగతిలోపు..	468
పదో తరగతి	5702
ఇంటర్మీడియెట్	6443
డిగ్రీ	6291
డిప్లమో	3418
ఇతర విద్యార్హతలు	15,592



జిల్లా ఉపాధి కార్యాలయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి ఆపై చదివిన వారు ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకుంటే అవసరాన్ని బట్టి క్రమ సంఖ్యలో సీనియారిటీ మేరకు ఉద్యోగావకాశాలకు కాల్ లెటర్లు పంపేవారు. అది కూడా ప్రభుత్వోద్యోగాలకు మాత్రమే. ఇదంతా గతం. నేడు ప్రైవేటు సంస్థలు పెరగడంతో నిపుణ్యం ఉన్నవారికి అవకాశాలు మెండుగా వస్తున్నాయి. ఉపాధి కల్పన కార్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)గా తీర్చిదిద్ది జాబ్‌మేళాల నిర్వహణతో పాటు పలు ప్రత్యేకమైన ఉద్యోగాల కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇప్పటికే ఎంసీసీలను డిజిటలైజ్ చేశారు. స్థానిక ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో దీనిని ఏర్పాటు చేశారు.

ఈ కేంద్రాల ఏర్పాటులో భాగంగా కొన్ని నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరియర్ సర్వీస్) పేరిట జాతీయ వెబ్‌పోర్టల్ ప్రారంభించింది. దీనిపై కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పోర్టల్‌లో జాబ్‌సీకర్‌గా కనీస విద్యార్హత 7వ తరగతి ఆపై చదివిన వారి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతానికి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేస్తున్నారు. విద్యార్థి స్వయంగా చేసుకోవాలంటే ఎన్‌సీఎస్ యూజర్ ఐడీ పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని సమగ్ర వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే పది, ఇంటర్‌మీడియట్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ డిప్లమో చేసిన వారు నమోదు చేసుకున్నారు.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు..

ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో వాటి స్థానంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ఒక నెంబరుతో కూడిన డిజిటైజ్డ్ కార్డు జారీ చేస్తారు. దీని ద్వారా అభ్యర్థి వివరాలు ప్రతి ఏడాది సవరించుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న వారి వివరాలు కేంద్రం నేరుగా పరిశీలించి అభ్యర్థి ప్రతిభ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ కొలువుల మేళాలకు ఎంపిక చేస్తుంది.

ఐటీ ల్యాబ్ ఏర్పాటు..

ఎంసీసీలో దాదాపు 10 కంప్యూటర్లతో ఐటీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఐటీ సాంకేతిక నిపుణులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి సైక్రోమెటిక్ అనే పరీక్ష నిర్వహించి దీని ద్వారా వారి శక్తి సామర్థ్యాలు గుర్తించి వారికి ఏ శిక్షణ ఇవ్వాలి, ఏ విధంగా ఉపాధి కల్పించాలి లేదా స్వయం ఉపాధికి ప్రోత్సహించాలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. కొలువులే గాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషిచేస్తున్నారు.

నెలకు రెండు జాబ్‌మేళాలు..



ఉపాధి కార్యాలయాలు మోడల్ కేరీర్ సెంటర్లుగా మారాయి. ఇందులో భాగంగా నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ సమాచారం ఇవ్వడంతో పాటు వ్యాపార, పరిశ్రమల ఏర్పాటు వంటి వాటిపై సమాచారం ఉంటుంది. ఇప్పటికే అవగాహన కల్పించాం. కాగిత రహిత పరిపాలన దిశలో భాగంగా డిజిటల్ కార్డు అందజేస్తారు.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

గ్రేడ్ 1 కమిషనర్‌గా ఏసుబాబు

కాకినాడ: గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబును కార్పొరేషన్ అధికారులు బుధవారం సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధ్యక్షతన వివిధ విభాగాల అధిపతులు ఆయనను సత్కరించారు. కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సమర్థవంతమైన సేవలతో గుమస్తా నుంచి అంచలంచెలుగా గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఏసుబాబు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏసుబాబు మాట్లాడుతూ అందరి సహకారాలతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలిగానని, పదోన్నతితో ఇక్కడే పని చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ డీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈలు వెంకటరావు, మాధవి, ఏవో శిరీష్ తదితరులు పాల్గొన్నారు.